క్లుప్తంగా

దొడ్డి కొమురయ్య జయంతి



గచ్చిబౌలి: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటయోధుడు దొడ్డి కొమురయ్య జయంతిని సోమవారం కొండాపూర్ టీఎస్ఎస్పీ 8వ బెటాలియన్‌లో ఘనంగా నిర్వహించారు. కమాండెంట్ పి.మురళీకృష్ణ ఆధ్వర్యంలో కొమురయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో బెటాలియన్ అదనపు కమాండెంట్ టి.గంగారాం, టీఎస్ సింగ్, అసిస్టెంట్ కమాండెంట్లు దేవి దాస్ రాథోడ్, నర్సింహస్వామి, రహమాన్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

6న శోభాయాత్ర

భాగ్యనగర్‌కాలనీ: హనుమాన్ జయంతి సందర్భంగా ఈ నెల 6న వీర హనుమాన్ విజయోత్సవ ర్యాలీ నిర్వహించనున్నట్లు విజిత్ వర్మ సోమవారం తెలిపారు. ఈ శోభాయాత్ర ఆల్విన్‌కాలనీ, ఎల్లమ్మబండ, హనుమాన్ టెంపుల్ వద్ద మొదలై సప్తగిరి కాలనీలోని రామాలయం వద్ద ముగుస్తుందన్నారు. ఈ సందర్భంగా మధ్యాహ్నం హనుమాన్ ఆలయంలో అన్నదానం ఉంటుందని చెప్పారు. అనంతరం ర్యాలీ గోడపత్రికను ఆవిష్కరించారు. కార్యక్రమంలో అల్లూరి రామరాజు, నరేందర్‌రెడ్డి, మణిభూషణ్, ప్రభాకర్ యాదవ్, గాలిపల్లి కమలాకర్‌రెడ్డి, నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర పథకాలు దేశానికే ఆదర్శం

పటాన్‌చెరు టౌన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. సోమవారం పటాన్‌చెరు పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన 43 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల ద్వారా మంజూరైన 43 లక్షల రూపాయల విలువైన చెక్కులను కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్‌లతో కలిసి ఆయన పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ కుమార్ గౌడ్, తహసీల్దార్ పరమేశం, ఎంపీడీఓ బన్సీలాల్, ఎంపీఓ హరిశంకర్‌గౌడ్, సీనియర్ నాయకులు దశరథ్ రెడ్డి, వెంకట్ రెడ్డి, పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

జిన్నారం(పటాన్‌చెరు): మృతదేహాన్ని తరలించేందుకు మున్సిపల్ వైస్ చైర్మన్ అనిల్‌కుమార్ రెడ్డి బాధిత కుటుంబీకులకు ఆర్థిక సాయం ప్రకటించారు. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బొల్లారం మున్సిపల్ పరిధిలోని పోచమ్మ బస్తీలో నివాసం ఉంటున్న బిహార్‌కు చెందిన రింకుదేవి సోమవారం అనారోగ్యంతో మృతి చెందింది. మృతదేహాన్ని బిహార్‌కు తరలించేందుకు అనిల్‌కుమార్‌రెడ్డి రూ.15వేల ఆర్థిక సాయం అందజేశారు. దీంతో మృతురాలి కుటుంబ సభ్యులు అనిల్‌కుమార్‌రెడ్డికి కృతజ్ఞతలు చెప్పారు.

సినర్జీ క్వాంటమ్ ఇండియా- ట్రిపుల్ ఐటీ ఎంఓయూ

రాయదుర్గం: ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ హైదరాబాద్ (ట్రిపుల్ ఐటీ హైదరాబాద్) సినర్జీ క్వాంటమ్ ఇండియాతో భాగస్వామ్యం చేసుకుంది. సైనిక, పౌర వినియోగ సందర్భాలలో సాంకేతికత, వాటి అనువర్తనాలను అభివృద్ధి చేయడం ఈ సహకారం లక్ష్యం. ఈ ఒప్పందం ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్‌కి ఒక ముఖ్యమైన మైలురాయి. ఈ సందర్భంగా ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్ డైరెక్టర్ ప్రొఫెసర్ పిజే నారాయణన్ మాట్లాడుతూ ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్ దేశంలోనే అత్యంత విస్తృతమైన క్వాంటం కంప్యూటింగ్ రీసెర్చ్ గ్రూపులలో ఒకటని అన్నారు.

నియోజకవర్గ ప్రజలే నా బలగం

ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ

మియాపూర్: బీఆర్ఎస్ పార్టీకి కార్యకర్తలే శ్రీరామరక్ష అని శేరిలింగంపల్లి నియోజకవర్గం ఎమ్మెల్యే గాంధీ పేర్కొన్నారు. సోమవారం బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కె.చంద్రశేఖర్‌రావు ఆదేశాల మేరకు మియాపూర్ డివిజన్ పరిధిలోని విశ్వనాథ్ గార్డెన్‌లో పార్టీ డివిజన్ కార్యకర్తలు, నాయకులతో కలిసి ఆయన ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పరిపాలన విషయంలో దేశానికే తెలంగాణ రాష్ట్రం దిక్సూచిగా మారిందని , నేడు యావత్ దేశం మొత్తం తెలంగాణ వైపు చూసే విధంగా ముఖ్యమంత్రి కేసీఆర్ పరిపాలన నిదర్శనమన్నారు. రూ.85 కోట్లు పెట్టి నియోజకవర్గంను అభివృద్ధి చేసుకున్నామని వెల్లడించారు. అనంతరం మియాపూర్ డివిజన్ పరిధిలోని పలు కాలనీలకు చెందిన బీజేపీ, కాంగ్రెస్ పార్టీకి చెందిన 500 మంది నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ముగ్గురికి పాజిటివ్

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రిలో సోమవారం 33 మందికి కోవిడ్ టెస్టులు నిర్వహించగా ముగ్గురికి పాజిటివ్ వచ్చింది.

నాలాకు దారేది...?



జనప్రియ అపార్ట్‌మెంట్స్ వద్ద నాలా వరద వెళ్లకుండా అడ్డంగా ఉన్న ప్రహరీ గోడ

- నాలా విస్తరణకు ఆటంకాలు
- పట్టించుకోని అధికారులు

హఫీజ్‌పేట్: ఒక చెరువు నుంచి మరో చెరువుకు అనుసంధానంగా ఉన్న నాలాలు కుచించుకుపోవడంతో నీరు పారక వర్షాకాలం ముంపు సమస్య నెలకొంటోంది. హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని కాయిదమ్మకుంట చెరువు నుంచి గురునాథం చెరువు వరకు ఓపెన్ నాలా ఉండేది. క్రమేణా నాలా వెడల్పు తగ్గిపోవడంతో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నాలాగా మారింది. దీంతో భారీ వర్షాలకు నీరు నిలిచిపోయి ఇళ్లలోకి నీరు చేరుతోంది. కాయిదమ్మకుంట చెరువు నుంచి గురునాథం చెరువు వరకు వెళ్తున్న నాలా జనప్రియనగర్, జనప్రియ అపార్ట్‌మెంట్స్ 1,4, డాల్ఫిన్ టవర్స్ మీదుగా సితార హోటల్ జాతీయ రహదారి నుంచి గురునాథం చెరువులో కలుస్తుంది. కానీ ఈ మధ్యలో కాలనీల్లో అపార్ట్‌మెంట్స్‌తో పాటు పార్కులను ఏర్పాటు చేశారు. ఏకంగా అపార్ట్‌మెంట్స్ చుట్టు ప్రహరీ నిర్మించడంతో వరదలు వస్తే మునక తప్పదని జనప్రియవాసులు వాపోతున్నారు. గత సంవత్సరం వచ్చిన వరదలకు జనప్రియ అపార్ట్‌మెంట్స్ ఫేజ్ 5లోని ఇళ్లు నీట మునిగి ఆస్తినష్టం కలిగింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.



జనప్రియ అపార్ట్‌మెంట్స్ వద్ద పైప్‌లైన్

- నాలా విస్తరణ కోసం దాదాపు రూ.8 కోట్లు కేటాయించారు. సగం వరకు నాలా పనులు పూర్తి అయ్యాయి. తదనంతరం ఆగిపోయాయి.
- కాయిదమ్మకుంట నుంచి జనప్రియనగర్ మీదుగా జనప్రియ అపార్ట్‌మెంట్ ఫేజ్ 1 వరకు పనులు పూర్తి చేశారు. కానీ హేమదుర్గ అపార్ట్‌మెంట్ నుంచి ముందుకు సాగలేదు.
- హేమదుర్గ అపార్ట్‌మెంట్స్ నుంచి వెళ్లిన నాలా జాతీయ రహదారి సితార హోటల్ వద్ద చిన్న పైపుల ద్వారా బయటకు వెళ్లేలా చేశారు.
- వర్షాకాలం హేమదుర్గ అపార్ట్‌మెంట్స్‌తో పాటు జనప్రియ అపార్ట్‌మెంట్స్‌కు వరద భయం ఉంటుంది.
- పనులు సాగదీస్తున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

నాలా విస్తరణకు ఆటంకం కలిగిస్తున్నారు



హేమదుర్గ అపార్ట్‌మెంట్ వల్ల నాలా విస్తరణకు ఆటంకం కలిగింది. వర్షాకాలం చిన్న దుకాణాలలోకి నీరు చేరి తీవ్ర నష్టం చేకూర్చాయి. గత సంవత్సరం వచ్చిన వరదలకు ఇప్పటి వరకు తేరుకోలేదు. నాలా విస్తరణపై ఎమ్మెల్యే చొరవ తీసుకోవాలి.

–పునారాంచౌదరి, జనప్రియనగర్

వెంటనే పనులు ప్రారంభించాలి



నాలా విస్తరణ పనుల్లో భాగంగా హేమదుర్గ అపార్ట్‌మెంట్ నుంచి జాతీయ రహదారి వరకు నిలిచిపోయిన వాటిని వెంటనే సంబంధిత అధికారులు ప్రారంభించాలి. ఎమ్మెల్యే పనులు పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలి. ఆక్రమణకు గురైన వాటిని తొలగించాలి. నాలా విస్తరణ పనులు వేగంగా పూర్తి చేసి ఇబ్బందులు తొలగించాలి.

– మహేష్ యాదవ్, హఫీజ్‌పేట్

సమన్వయంతో సమస్యల పరిష్కారం



సమావేశంలో వెస్ట్ జోనల్ కమిషనర్ శంకరయ్య, వివిధ విభాగాల అధికారులు

జోనల్ కమిషనర్ శంకరయ్య

గచ్చిబౌలి: అధికారుల సమన్వయంతోనే ప్రజా సమస్యలకు పరిష్కారం లభిస్తుందని శేరిలింగంపల్లి వెస్ట్ జోనల్ కమిషనర్ శంకరయ్య అన్నారు. సోమవారం శేరిలింగంపల్లి వెస్ట్ జోనల్ కార్యాలయంలో ప్రజా సమస్యలపై వివిధ విభాగాల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఐటీ కారిడార్‌లో ట్రాఫిక్ పెరగడంతో జంక్షన్లు, రోడ్ల విస్తరణ, సర్వీస్ రోడ్ల అభివృద్ధిపై చర్చించారు. ఫుట్‌పాత్ నిర్మాణం, వాటర్ లాగింగ్ పాయింట్స్, మాన్‌సూన్ టీమ్‌లపై పలు సూచనలు చేశారు. వీధి దీపాల మరమ్మతులను వెంటనే చేపట్టాలని ఇంజనీరింగ్ విభాగం అధికారులను జడ్సీ ఆదేశించారు. నాలాలు, రోడ్లు, ఖాళీ స్థలాల్లో చెత్త వేయకుండా చర్యలు తీసుకోవాలని ఉప కమిషనర్లకు ఆదేశాలు జారీ చేశారు. ప్రతి ఇంటి నుంచి తడి, పొడి చెత్త వేర్వేరుగా స్వచ్ఛ ఆటోల్లో వేసే విధంగా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని సూచించారు. నిర్మాణ వ్యర్థాలను రోడ్లపై వేయవద్దన్నారు. ముంపు ప్రాంతాలను గుర్తించి తగు చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమంలో మాదాపూర్ ఏసీపీ రఘునందన్‌రావు, పటాన్‌చెరు డీఎస్పీ భీమ్ రెడ్డి, వాటర్‌వర్క్స్ జీఎం రాజశేఖర్, డీసీలు వెంకన్న, సుధాంష్ తదితరులు పాల్గొన్నారు.

సమ్మర్ క్రికెట్ టోర్నమెంట్



గచ్చిబౌలి: సమ్మర్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు రఘునాథ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు, బీజేవైఎం రాష్ట్ర కోశాధికారి రఘునాథ్ యాదవ్ తెలిపారు. సోమవారం కొండాపూర్‌లో బీజేపీ శేరిలింగంపల్లి అసెంబ్లీ కన్వీనర్ రాఘవేంద్రరావు, నేషనల్ బాక్సర్ ఉదయ్‌కుమార్‌లు టోర్నమెంట్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఫైనల్ విజేతకు లక్ష రూపాయలు, రెండవ స్థానంలో నిలిచిన జట్టుకు రూ.50 వేలు, మూడవ బహుమతిగా రూ.25 వేలు, 4,5 స్థానంలో నిలిచిన జట్లకు బహుమతులు, క్రికెట్ కిట్లు అందజేస్తామని నిర్వాహకులు తెలిపారు. ఎంట్రీ ఫీజు రూ.500 చెల్లించి, ఏప్రిల్ 8వ తేదీలోపు జట్ల పేర్లను రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు. వివరాల కోసం 7396286696, 9000442204 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

స్వచ్ఛత ప్రతి ఒక్కరి బాధ్యత

పటాన్‌చెరు: పర్యావరణానికి పెనుముప్పుగా మారిన ప్లాస్టిక్‌ను నియంత్రించడంతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన స్వచ్ఛ సర్వేక్షణ్ 2023 కార్యక్రమాల్లో భాగంగా సోమవారం ఉదయం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుంచి మైత్రి మైదానం వరకు ఏర్పాటుచేసిన సైకిల్ ర్యాలీని ఆయన ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. చెత్తను బహిరంగ ప్రదేశాల్లో పారవేయకుండా స్వచ్ఛ ఆటోలకు అందించడంతోపాటు 120 మైక్రాన్ల కంటే తక్కువ మందం కలిగిన ప్లాస్టిక్ కవర్లను వినియోగించకూడదని కోరారు. ప్రతి ఒక్కరూ తమ ఇళ్ల ఆవరణలో మొక్కల పెంపకానికి ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ ప్రభాకర్, పటాన్‌చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్, రామచంద్రాపురం కార్పొరేటర్ పుష్ప నగేష్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్‌కుమార్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు అఫ్జల్, జీహెచ్ఎంసీ అధికారులు, సైక్లింగ్ బృంద సభ్యులు పాల్గొన్నారు.

కబ్జాలకు కేరాఫ్ ఆల్విన్‌కాలనీ డివిజన్



పాదయాత్రలో నాయకుడు రవికుమార్ యాదవ్, బీజేపీ నాయకులు

బీజేపీ నాయకుడు రవికుమార్ యాదవ్

ఆల్విన్‌కాలనీ: శేరిలింగంపల్లి బీజేపీ రాష్ట్ర నాయకుడు రవికుమార్ యాదవ్ చేపట్టిన గడప గడపకు పాదయాత్ర సోమవారం 4వ రోజుకు చేరింది. డివిజన్ పరిధిలోని ధరణినగర్, చక్రధర్‌నగర్, ఆల్విన్‌కాలనీ ఆఖరు బస్టాప్ వరకు యాత్ర కొనసాగింది. ఈ సందర్భంగా రవికుమార్ యాదవ్ మాట్లాడుతూ ఆల్విన్‌కాలనీ డివిజన్ బీఆర్‌యస్ నాయకుల కబ్జాలకు కేరాఫ్ అడ్రస్‌లో మొదటి స్థానంలో నిలిచారని విమర్శించారు. కాలనీలో డ్రైనేజీ పొంగి పొర్లుతూ దుర్గంధం వెదజల్లుతోందన్నారు. ప్రభుత్వ స్థలాలు, పార్కు స్థలాలు కనిపిస్తే చాలు అధికార పార్టీ నాయకులు వారి అనుచరులు కబ్జాలు చేస్తూ రేపటి తరానికి ఆట మైదానాలు, పార్కులు అనేవి ఎలా ఉంటాయో కూడా తెలియని పరిస్థితి కల్పించారని దుయ్యబట్టారు. పాదయాత్రలో అనేక సమస్యలు తమ దృష్టికి తీసుకువచ్చారని వాటిని పరిష్కరిస్తామన్నారు. జిల్లా ఉపాధ్యక్షుడు రామరాజు, సీనియర్ నాయకులు నరేందర్‌రెడ్డి, బీజేవైఎం నేషనల్ ఆఫీస్ కోఆర్డినేటర్ కుమార్‌యాదవ్, బీజేవైఎం రాష్ట్ర జనరల్ సెక్రటరీ అరుణ్‌కుమార్, డివిజన్ అధ్యక్షుడు కమలాకర్‌రెడ్డి, డివిజన్ జీఎస్ రాజు, రఘుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో నాయకులు శ్రీకాంత్, వివేక్, వెంకట్‌రెడ్డి, రామ్‌రెడ్డి, మోహన్ రెడ్డి శ్రీనివాస్, శివాజీ తదితరులు పాల్గొన్నారు.

ప్రొ.మహ్మద్ సిద్ధిఖీకి అరుదైన గౌరవం



రాయదుర్గం: మనూ ప్రొఫెసర్ మహ్మద్ సిద్ధిఖీకి అరుదైన గౌరవం లభించింది. స్కూల్ ఆఫ్ ఎడ్యుకేషన్ అండ్ ట్రెనింగ్ డీన్, ఓఎస్‌డీ-2 ప్రొఫెసర్ సిద్ధిఖీకి హెన్రీ మార్టిన్ ఇన్‌స్టిట్యూట్ (ఇంటర్నేషనల్ సెంటర్ ఫర్ రీసెర్చ్) ద్వారా ప్రతిష్టాత్మకమైన హానోరిస్ కాసా (డాక్టర్ ఆఫ్ డివినిటీ) గౌరవ పట్టా ను అందించారు. వీసీ ఐనుల్‌హసన్, రిజిస్ట్రార్ ప్రొ. ఇష్తియాక్ అహ్మద్, ఓఎస్‌డీ ప్రొఫెసర్ షుగుఫ్తా షాహీన్, ఇతర అధికారులు ఆయనను అభినందించారు.

కాలనీల అభివృద్ధికి పెద్ద పీట



మురుగునీటి కాలువల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు: గ్రామాల పరిధిలో నూతనంగా ఏర్పడుతున్న కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తున్నామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. అమీన్‌పూర్ మండలం కిష్టారెడ్డిపేట గ్రామ పరిధిలోని కల్యాణ్ ఎస్టేట్స్ కాలనీలో రూ.70 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న అంతర్గత మురుగునీటి కాలువల నిర్మాణ పనులకు సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అభివృద్ధిలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ ప్రభాకర్, ఎంపీపీ దేవానందం , జెడ్పీటీసీ సుధాకర్ రెడ్డి, సర్పంచ్ కృష్ణ, వైస్ ఎంపీపీ సునీత సత్యనారాయణ, బీఆర్ఎస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ తదితరులు

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ ఎల్లమ్మబండలోని హిందు స్మశానవాటికలో జరుగుతున్న సీసీ రోడ్డు తదితర పనులను సోమవారం స్థానిక కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోటి యాభై లక్షల రూపాయల అంచనా వ్యయంతో పనులు చేపట్టామన్నారు. స్మశాన వాటికలో ఉద్యానవనం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు సమ్మారెడ్డి, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, ప్రదీప్ రెడ్డి, జగదీష్, మల్లేష్, వెంకటేష్, ఫారూఖ్, నాగరాజు, ఏఇ శివప్రసాద్, వర్క్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

మహనీయుల జీవితాలు స్ఫూర్తిదాయకం

పటాన్‌చెరు: భారత ఔన్నత్యాన్ని విశ్వవ్యాపితం చేసిన మహనీయులు భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, విశ్వగురు మహాత్మా బసవేశ్వర విగ్రహాలను ఏర్పాటుచేసి భవిష్యత్ తరాలకు వారి స్ఫూర్తిని అందించేందుకు కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి అన్నారు. సొంత నిధులతో పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్ కూడలి, తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని కొల్లూరు, వెలిమల తండాల్లో అంబేడ్కర్ విగ్రహాలతో పాటు బీరంగూడ చౌరస్తాలో బసవేశ్వరుడి విగ్రహాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ నెల 12న వెలిమల తండాలో, 13న కొల్లూరులో, 14న ఇస్నాపూర్‌లో విగ్రహాలను ఆవిష్కరించనున్నట్లు తెలిపారు. 16వ తేదీన బీరంగూడ చౌరస్తాలో మహాత్మ బసవేశ్వర విగ్రహాన్ని ఆవిష్కరించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. విగ్రహాల ఆవిష్కరణ ఏర్పాట్లపై సోమవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అన్ని సంఘాల ప్రతినిధులతో సమీక్ష నిర్వహించారు. విగ్రహావిష్కరణలకు అన్ని వర్గాల ప్రజలు హాజరయ్యేలా చూడాలని కోరారు. వీటితోపాటు మహాత్మా గాంధీ, ఛత్రపతి శివాజీ, చాకలి ఐలమ్మల విగ్రహాలను ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. దేశంలోనే మొట్టమొదటిసారిగా దళితుల ఆర్థిక అభ్యున్నతి కోసం దళిత బంధు ప్రవేశపెట్టి వారి జీవితాల్లో వెలుగు నింపిన మహోన్నత నాయకుడు సీఎం కేసీఆర్ అన్నారు. ఈ సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు పాండు, నాయకులు శ్రీశైలం యాదవ్, దశరథ్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

పది పరీక్షలు ప్రారంభం

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి మండల పరిధిలో పదవ తరగతి పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని మండల విద్యాధికారి కె.వెంకటయ్య తెలిపారు. మండల పరిధిలో 5350 మంది విద్యార్థులకు గాను 5325 మంది హాజరయ్యారని తెలిపారు.

హనుమాన్ శోభాయాత్రకు కట్టుదిట్టమైన భద్రత

రాయదుర్గం: హనుమాన్ శోభాయాత్రకు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసినట్లు సైబరాబాద్ సీపీ స్టీఫెన్ రవీంద్ర స్పష్టం చేశారు. గచ్చిబౌలిలోని సైబరాబాద్ కమిషనరేట్‌లో సోమవారం సాయంత్రం హనుమాన్ విజయయాత్ర బందోబస్తుపై ఆయన సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా లా అండ్ ఆర్డర్ డీసీపీలు, ఇన్‌స్పెక్టర్లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ర్యాలీలు తీసే నిర్వాహకులు ముందస్తుగా స్థానిక పోలీస్‌స్టేషన్ల నుంచి విధిగా అనుమతులు పొందాలన్నారు. సంబంధిత పోలీస్‌స్టేషన్ల ఇన్‌స్పెక్టర్లు హనుమాన్ ర్యాలీ ఆర్గనైజర్లు, యువతతో పీస్ కమిటీ సమావేశాలు నిర్వహించుకోవాలన్నారు. సోషల్ మీడియాలో రూమర్లు పోస్ట్ చేసే వారిపై నిఘా ఉంచాలన్నారు. ఈ సమావేశంలో సైబరాబాద్ జాయింట్ సీపీ అవినాష్‌మహంతి, జాయింట్ సీపీ ట్రాఫిక్ నారాయణ్ నాయక్, మాదాపూర్ డీసీపీ శిల్పవల్లి, బాలానగర్ డీసీపీ సందీప్, రాజేంద్రనగర్ డీసీపీ జగదీశ్వర్‌రెడ్డి, శంషాబాద్ డీసీపీ నారాయణరెడ్డి, ట్రాఫిక్ డీసీపీ హర్షవర్ధన్, ఎస్‌ఓటీ డీసీపీ రషీద్, ఏడీసీపీలు, ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీ స్టీఫెన్ రవీంద్ర

సహకారం పెంపొందించుకోవడమే లక్ష్యం

మనూ వీసీ ఐనుల్ హసన్

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంను సోమవారం సాయంత్రం రిపబ్లిక్ ఆఫ్ టర్కీ కాన్సులేట్ కాన్సుల్ జనరల్ ఓర్హాన్‌యల్మాన్ ఓకాన్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఉర్దూ యూనివర్సిటీ క్యాంపస్‌లోని పరిపాలనా భవనంలో వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్‌హసన్‌తో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. అకడమిక్ ప్రోగ్రామ్‌లలో టర్కిష్ విశ్వవిద్యాలయాలు, మనూ మధ్య అవగాహన ఒప్పందంపై కాన్సుల్ జనరల్ చర్చించారు. వీసీ ఐనుల్ హసన్ మాట్లాడుతూ సహకారం మరింత పెంపొందించుకోవడమే లక్ష్యమన్నారు. ఈ సందర్భంగా విద్య, పరిశోధనలు, సాంస్కృతిక అంశాలపై చర్చించారు.

బీఆర్ఎస్‌లో చేరికలు

రాయదుర్గం: గచ్చిబౌలి డివిజన్‌కు చెందిన పలువురు మహిళలు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ప్రభుత్వవిప్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ, గచ్చిబౌలి మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా సమక్షంలో ఆదివారం రాత్రి పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారికి వారిద్దరు పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఇప్పటికే నెహ్రూనగర్‌లో బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు ఖాళీ అయ్యాయని, ఇక మిగతా చోట్ల కూడా ఇదే పరిస్థితి నెలకొనడం ఖాయమన్నారు. పార్టీలో చేరిన వారిలో కల్పన, శోభారాణి, లక్ష్మీ, కవిత, భాగ్యలక్ష్మీ, రజని, సుకన్య, చంద్రలేఖ, ఆదిలక్ష్మీ, సునీత తదితరులున్నారు.



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే గాంధీ, మాజీ కార్పొరేటర్ సాయిబాబా

బల్గేరియాకు హెచ్‌సీయూ విద్యార్థులు



లాస్యప్రియ



మహ్మద్ నసీహ్



సంజీవిని

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ఇంటిగ్రేటెడ్ విద్యార్థులు బల్గేరియా పర్యటనకు ఎంపికయ్యారు. డిజిటల్ స్టోరీ టెల్లింగ్ పోటీలో విద్యార్థులు ఎస్ సంజీవిని, మహ్మద్ నసీహ్, వి.లాస్యప్రియలు గెలిచారు.ఈ ముగ్గురు జూన్/జూలై-2023లో బల్గేరియాలోని వర్నా యూనివర్సిటీ ఆఫ్ మేనేజ్‌మెంట్ నిర్వహించనున్న ఇంటర్ కల్చరల్ అవేర్‌నెస్ అండ్ కల్చరల్ డైవర్సిటీ (ఐఏసీడీ)పై రెండు వారాల 'బూట్‌క్యాంప్'కి హాజరవుతారు. వీరు తమ మొబైల్‌లో4 నిమిషాల డిజిటల్ కథనాలను ప్రత్యక్ష అనుభవం లేదా ఊహాజనిత స్క్రిప్ట్‌తో సమకాలీన వాస్తవాలను ప్రతిబింబింప చేశారు.

ఔట్‌లెట్ సమస్య పరిష్కారానికి చర్యలు

శేరిలింగంపల్లి: డోయన్స్ కాలనీలో ఔట్‌లెట్ సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తామని ఎమ్మెల్యే గాంధీ అన్నారు. శేరిలింగంపల్లి డివిజన్ డోయన్స్ కాలనీలో ఔట్‌లెట్ సమస్యను ఆయన సోమవారం పరిశీలించారు. రాబోయే వర్షాకాలానికి పనులన్నింటిని పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ డీఈ శ్రీనివాస్, ఏఈ సునీల్, నాయకులు శ్రీనివాస్‌యాదవ్, కాలనీవాసులు లింగారెడ్డి, సంజీవరెడ్డి, బాబురావు, భీమేశ్వరరావు, అవంతి కుమార్, బెనర్జీ, సత్యనారాయణ పాల్గొన్నారు.

కబ్జా..ఆపై కట్టడాలు

- గండిగూడలో ప్రభుత్వ భూముల ఆక్రమణలు
- జీఓ 59 దరఖాస్తు చేసుకోవచ్చంటూ అమ్మకాలు

పటాన్‌చెరు: సుల్తాన్‌పూర్ మెడికల్ డివైజెస్ పార్కు సమీపంలోని గండిగూడ, దాయర గ్రామాల్లో ప్రభుత్వ స్థలాలు అన్యాక్రాంతం అవుతున్నాయి. గండిగూడ నుంచి బొల్లారం వెళ్లే దారిలో ప్రభుత్వ స్థలాల్లో చిన్న గదులు నిర్మించి వాటిని కబ్జా చేస్తున్నారు. ఆయా పార్టీల నాయకులు, గ్రామపెద్దల అండదండలతో ఈ కబ్జాలు కొనసాగుతున్నాయి. జీఓ నంబరు 59 కింద దరఖాస్తు చేయవచ్చని చెబుతూ, వాటిని అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు. ఆసాని కుంట కాల్వలను కూడా పూడ్చి వేసి ఆక్రమణలకు తెరలేపారు. రాత్రికిరాత్రి ఆ గ్రామాల పరిధిలో భూములు కబ్జాపరమవుతున్నాయి. బొల్లారం పారిశ్రామికవాడకు సమీపంలో ఉండటంతో పాటు కొత్తగా వచ్చిన సుల్తాన్‌పూర్ పారిశ్రామికకేంద్రం కూడా అభివృద్ధి చెందుతుండటంతో ఈ ప్రాంతంలో భూముల ధరలకు రెక్కలు వచ్చాయి. వివిధ రా ష్ట్రాల నుంచి వచ్చి స్థిరపడిన కార్మికులను టార్గెట్ చేసి భూములు కబ్జా చేసి కట్టిన ఇళ్లు, స్థలాలను అమ్ముతున్నారు. వంద గజాల స్థలం రూ.పది నుంచి పదిహేను లక్షలు చెబుతున్నారు. పంచాయతీ నుంచి ఇంటి నంబర్లు ఇప్పిస్తామని చెప్పి కబ్జాలు చే స్తున్నారు. ప్రభుత్వ, చెరువుకాల్వల భూముల అన్యాక్రాంతాన్ని ఆపాలని స్థానికులు కోరుతున్నారు.



బొల్లారం వెళ్లే దారిలో కాల్వపై వెలసిన నిర్మాణం

కబ్జాలను నిరోధిస్తాం

ప్రభుత్వభూముల కబ్జాలను నిరోధిస్తాం. ఇదివరకే ఆక్రమణలను తొలగించాం. మండల పరిధిలో ప్రభుత్వ భూములను కాపాడేందుకు అన్నిరకాల చర్యలు తీసుకుంటున్నాం. కబ్జాదారులపై క్రిమినల్ కేసులు కూడా పెడతాం.

– దశరథ్, అమీన్‌పూర్ తహసీల్దార్